క్లుప్తంగా

ఇళ్లు నాణ్యతతో నిర్మించాలి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోవింద్

మామడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. గురువారం మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి గంగాసాగర్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పాఠశాల వార్షికోత్సవం


వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఇందులో హెచ్‌ఎం రాజేశ్‌నాయక్, ఉపాధ్యాయులు, పోసాని, నిక్షిత, శ్రీహరి సిబ్బంది ఉన్నారు.

గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులతో ఉపాధ్యాయులు

లోకేశ్వరం: విద్యార్థులు చదువులో ముందుండాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీమాల అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీనగర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్యాడుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు.. విద్యార్థులకు ప్రగతికార్డులు అందజేశారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: భూభారతి చట్టం చేసి పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చినందుకు గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి, సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. నిర్మల్ జిల్లా గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, జిల్లా మైనారిటీ చైర్మన్ జునెద్ మెమన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

సోన్: పాడిరైతులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి బాలిక్ అహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని సాకేర గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వీఏఎస్ ఓం ప్రకాష్, మురళి, సుప్రియ, హెచ్‌ఏ గోల సాయన్న, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు ప్రారంభం

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లిలో స్వయం సహాయక సంఘం సభ్యులు గురువారం భూసార పరీక్షలు ప్రారంభించారు. స్థానిక గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో సరస్వతీ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ పేరిట ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఏపీఎం సులోచన భూసార పరీక్షకు రూ.200 తీసుకుంటున్నారని.. స్థానిక రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఖానాపూర్: మారుమూల గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సునీత అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ఉపాధి పనులు తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు, భగీరథ ఏఈ కృష్ణ తదితరులు ఉన్నారు.

పెరిగిన పరిహారం..!

- వడదెబ్బ మృతులకు రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఓ రైతుకూలీ ఇటీవల చేనులో పని చేస్తూ అక్కడే కుప్పకూలాడు. రోజంతా ఎండలో పనిచేయడంతో వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు భావించారు. అయితే మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించకుండా ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించేశారు. మృతుడిది బీద కుటుంబం కావడంతో వడదెబ్బ మృతిగా పరిగణించి, పరిహారం ఇప్పించాలని కుటుంబీకులు ప్రస్తుతం అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అయితే పరిహారం పొందాలంటే వడదెబ్బతో మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించాలని, ఆపై పోలీసులు కేసు నమోదు చేసి నివేదిక రెవెన్యూ అధికారులకు అందిస్తే, వారు ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తారు. తద్వారా పరిహారం మంజూరవుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వడదెబ్బ మృతులకు అందించే ఎక్స్‌గ్రేషియాను రూ.50వేల నుంచి రూ.4లక్షలకు పెంచింది. ఈ నేపథ్యంలో సరైన అవగాహనతో దరఖాస్తు చేసుకుంటే పేదలకు ప్రయోజనం చేకూరుతుంది.

పేదలకు ప్రయోజనం...

ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. 8 గంటలకే అధిక ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కానీ రోజువారీ కూలీలు, పంట చేలల్లో పనిచేసే రైతులు, చిరు ఉద్యోగులు, డ్రైవర్లు, చిరువ్యాపారులు ఎండలను లెక్కచేయకుండా పనులకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వడగాడ్పులు, ఎండల తీవ్రతతో డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి ఇంటి పెద్దను కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇలాంటివారిని ఆదుకునేందుకు ప్రభుత్వం విపత్తు నిర్వహణ కింద వడదెబ్బ మృతులకు పరిహారం అందిస్తోంది.

పరిహారం మార్గదర్శకాలిలా...

వడగాడ్పులు, వడదెబ్బతో మృతి చెందితే ప్రత్యేక విపత్తు కేటగిరీ కింద పరిహారం అందించాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలో వేడి గాలుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం నేపథ్యంలో, ఆ సమయంలో సంభవించిన మరణాలకే ఈ పరిహారం వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. విపత్తు నిర్వహణ శాఖ మార్గదర్శకాల ప్రకారం.. కలెక్టర్, వైద్యాధికారులు మృతుడి మరణానికి కారణం ధ్రువీకరించిన తర్వాతే బాధిత కుటుంబానికి పరిహారం మంజూరవుతుంది. రైతు బీమా పథకంలో నమోదైన వారు వడదెబ్బతో మృతిచెందితే ఏ పథకం కింద ఎక్కువ పరిహారం వస్తుందో దానినే అమలు చేస్తారు. వాతావరణ విభాగం మార్గదర్శకాల ప్రకారం.. 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా, సాధారణ ఉష్ణోగ్రతకు 5 నుంచి 7 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాల్లోనే వడదెబ్బ మృతిగా పరిగణించనున్నారు.

ఇలా పొందాలి..

వడదెబ్బతో మృతి చెందిన పరిహారం పొందాలంటే ముందుగా పోస్టుమార్టం తప్పనిసరి. డెత్ సర్టిఫికెట్‌తో త్రిసభ్య కమిటీ(వైద్యాధికారి, తహసీల్దార్, ఎస్సై)కి సమాచారమివ్వాలి. వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యాధికారి ధ్రువీకరించాలి. అనంతరం పోలీసులు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఉండాలి. సమీపంలోని ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి నివేదికను పోలీస్‌స్టేషన్‌లో అందిస్తే ఎఫ్‌ఐఆర్ ఆధారంగా వడదెబ్బ మృతిగా నిర్ధారిస్తారు. ఆ నివేదికను తహసీల్దార్ ద్వారా ఆర్డీఓకు, అక్కడి నుంచి కలెక్టర్ పరిశీలనకు పంపిస్తారు. కలెక్టర్ పరిశీలన అనంతరం బాధిత కుటుంబానికి పరిహారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు.

ఉత్తర్వులు అందాయి..

వడదెబ్బ మృతులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాను రూ.4లక్షలకు పెంచింది. ఉత్తర్వులు సైతం అందాయి. ఎవరైనా వడదెబ్బతో మృతి చెందితే, ముందుగా వైద్యుడితో ధ్రువీకరించాలి. ఆపై పోలీసులకు సమాచారమిచ్చి పోస్టుమార్టం, ఎఫ్‌ఐఆర్ ఆధారంగా దరఖాస్తు చేసుకుంటే పరిహారం అందుతుంది.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్, భైంసా

‘భూభారతి’పై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి


తానూరు : హంగిర్గాలో మాట్లాడుతున్న తహసీల్దార్ లింగంమూర్తి


కడెం: లక్ష్మీసాగర్‌లో రైతు నుంచి సలహా స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది


దస్తురాబాద్: రేవోజీపేటలో చట్టం గురించి వివరిస్తున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్


కుంటాల: అంబుగామలో మాట్లాడుతున్న తహసీల్దార్ కమల్‌సింగ్


బోరిగాంలో అవగాహన కల్పిస్తున్న డీటీ అశోక్

తానూరు: భూభారతి పోర్టల్‌పై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని తహసీల్దార్ లింగంమూర్తి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టంపై గురువారం మండలంలోని దాగాం, హంగిర్గా, ఎల్వత్, వాడవన గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో భూసమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్‌కు ఉండేదని..భూభారతి చట్టంలో తహసీల్దార్, ఆర్డీవోలకు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కడెం: భూభారతి పోర్టల్‌తో రైతులకు మేలు చేకూరుతుందని ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని పాండ్వపూర్, లక్ష్మీసాగర్ గ్రామాల్లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. డీటీ లచ్చిరాం, ఆర్‌ఐలు శారద, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, పొద్దుటూరి సతీశ్ రెడ్డి, సిబ్బంది, తదితరులున్నారు. మండలంలోని గ్రామాల్లో ఈనెల 30వరకు భూభారతిపై అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి లిఖితపూర్వకంగా సలహాలు, సూచనలు స్వీకరించారు.

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్, బామ్ని (బి) గ్రామాల్లో భూభారతి పోర్టల్‌పై రైతులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు నవతజ్యోతి, సుమలత, కార్యదర్శి నవనీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేటలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ ఆధ్వర్యంలో భూభారతి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 25 వరకు రెవెన్యూ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్‌ఐ ఆర్తి, ఏఈవో కిరణ్, కార్యదర్శి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని అంబుగామ, మెదన్‌పూర్ గ్రామాల్లో భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కమల్ సింగ్, ఆర్‌ఐలు అడెల్లు, రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసారూరల్: భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం భూ భారతి పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చిందని డీటీ అశోక్ అన్నారు. భూభారతి పోర్టల్‌పై మండలంలోని హంపోలి, బోరిగాం గ్రామాల్లో అవగాహన కల్పించి.. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ దత్తాత్రేయ, రెవెన్యూ సిబ్బంది శంకర్ తదితరులు ఉన్నారు.

‘బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి’


సారంగపూర్ : నినాదాలు చేస్తున్న నాయకులు


మామడలో మాట్లాడుతున్న సాహెబ్‌రావు

తానూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎన్నికల పర్యవేక్షకులు, ఆ పార్టీ నాయకులు రాజేశ్‌బాబు పేర్కొన్నారు. గురువారం తానూరు ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కైలాస్, చిన్నారెడ్డి, శివాజీపటేల్, నారాయణ, మాజీ సర్పంచ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి తక్కల రమణారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక కోసం సమావేశమై అభిప్రాయాలను సేకరించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి రాజేందర్, కౌన్సిల్ సభ్యులు వినోద్‌రెడ్డి, గొల్లమాడ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, అర్జున్ ఠాకూర్, దత్తురాం, బొల్లి గంగారాం, సురేశ్, సంజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మామడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీజేపీ ఎన్నికల కమిటీ నిర్వహణ బాధ్యుడు సిందేకర్ సాహెబ్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఆ పార్టీ మండల కన్వీనర్ రంజిత్‌కుమార్, బాపురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నవీన్, నరేందర్‌రెడ్డి, పవన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలకేంద్రం సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాల్వ సరేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కమిటీ ఎన్నిక గురించి అభిప్రాయాలను సేకరించారు. మెడిసెమ్మె రాజు, సత్యం చంద్రకాంత్, మంతెన గంగారెడ్డి, సాహెబ్‌రావు, రాజేశ్వర్, సాగర్‌రెడ్డి, విలాస్, ఎల్లన్న, నారాయణ, రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని జాప్రపూర్ సాయిబాబా ఆలయ ఆవరణలో బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక కోసం సమావేశం నిర్వహించినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. మండల ఇన్‌చార్జి జమాల్, రాచకొండ సాగర్, నరేశ్, హరీశ్‌రెడ్డి, నరసయ్య, సంతోష్, రాజేశ్వర్, దినేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేద్దామని ఆ పార్టీ నేత, ఎన్నికల కమిటీ నిర్వహణ బాధ్యుడు వి.సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా 12 మందితో కూడిన మండల కమిటీ కార్యవర్గం, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో పార్టీ జిల్లా ప్రధాన కర్యాదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, డి.ముత్యంరెడ్డి, జంగం వీరేశ్, పీసరి శైలేశ్వర్, విజయ్, భోజారాం, సాయారెడ్డి, రాజు, ఎం.పవన్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ మాక్ టెస్ట్ సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: ఇంటర్ పూర్తి చేసుకున్న ముథోల్ నియోజకవర్గ ప్రాంత విద్యార్థుల కోసం నీట్ మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన సాయి సుప్రియ ఆస్పత్రి వైద్యులు అపూర్వ, రజినీకాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పులేనగర్ సుభద్రవాటిక శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఈనెల 17నుంచి 20వరకు మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 96034 41711 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తోపుడు బండ్ల తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో రోడ్లపై తోపుడు బండ్లను నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా గురువారం తొలగింపజేశారు. తోపుడుబండ్లు ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని సూచించారు. రోడ్లపై ఆటో నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

‘పీఎం స్వనిధి బోర్డులు అందించాలి’

భైంసాటౌన్: పీఎం స్వనిధి కింద ప్రయోజనం పొందిన వారికి పంపిణీ చేసిన బోర్డులను వెంటనే అందించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ విషయమై గురువారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం స్వనిధి లబ్ధిదారులకు వారి ఫొటోలతో కూడిన బోర్డులు పంపిణీ చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు అందించకపోవడం సరికాదని.. ఇప్పటికైనా అందించాలని కోరారు. కార్యక్రమంలో పోశెట్టి, మల్లేశ్, రాము, లింగోజి తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి


సీటు పొందిన విద్యార్థులతో ఎంఈవో ముత్యం

కుంటాల:విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య బోధిస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. కుంటాల సృజన విద్యా నిలయం పాఠశాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోనే సృజన విద్యా నిలయం నుంచి నవోదయకు ఎక్కువ మంది ఎంపికవడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ కొత్త కాపుగంగన్న, ఏవో విక్రమ్, ఏఈవో శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సునంద, రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

లక్ష్మణచాంద: ఉపాధిహామీ కింద రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని అదనపు డీఆర్డీవో నాగవర్ధన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని, పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో ప్రమీల, టీఏలు దినేశ్, భీమ్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలు అరికడుదాం


భైంసాలో పోస్టర్ ప్రదర్శిస్తున్న అధికారి, సిబ్బంది

భైంసాటౌన్: వేసవిలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని.. ఈ మేరకు తగు జాగ్రత్తలు తీసుకొని వాటిని అరికడదామని భైంసా అగ్నిమాపక అధికారి ఎం.రవి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవా ల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రమాదాలు, నివారణ తదితర అంశాలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఫైర్‌మన్లు రాజేందర్, విలాస్, జాజీరాం, సాయిప్రసాద్ తదితరులున్నారు.

ఖానాపూర్: పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది జావెద్ అలీ, ఖదీర్ ఖాన్, వెంకటేశ్, శ్రీకాంత్, హుస్సేన్, సాయిచరణ్, నరేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

27న రజతోత్సవ సభకు తరలిరావాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భైంసాటౌన్: వరంగల్ జిల్లాలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో జనం విసుగు చెందారని..మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఏ-2 పరీక్షలు


రత్నాపూర్ కాలనీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లాలో అన్ని పాఠశాలల విద్యార్థులకు గురువారం ఎస్‌ఏ-2 పరీక్షలు ముగిశాయి. వారంపాటు ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పరీక్షలు నిర్వహించారు. ఈనెల 23న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ప్రోగ్రెస్ కార్డులు ఇస్తారు. సమ్మేటివ్ పరీక్షలు పూర్తి కావడంతో జవాబు పత్రాలు దిద్దే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. ఈనెల 20లోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. 21న ఆన్‌లైన్‌లో కార్డులు డౌన్‌లోడ్ చేసుకుని మరోసారి క్రాస్ చెక్ చేసుకుని, 23న తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలో ఆన్‌లైన్‌లో ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

25వసారి రక్తదానం


ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న శివక్రిష్ణ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల ఆరోగ్య సమన్వయ కర్తగా విధులు నిర్వహించే శివక్రిష్ణగౌడ్ గురువారం రక్తదానం చేశారు. ఇదే మండలంలోని పీచరకు చెందిన బొమ్మరేణి శ్రీలత అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. కాని అధిక రక్తస్రావం ఎక్కువ కావడంతో ఆమెకు రక్తం ఎక్కించాలని వైద్యులు కుటుంబసభ్యులకు సూచించారు. ఆమె రక్తవర్గం ఏ పాజిటివ్ అందుబాటులో లేదు. ఈ విషయం తెలిసి శివక్రిష్ణగౌడ్ వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్తం ఇచ్చి బాలింతను కాపాడారు. తాను ఇప్పటివరకు 25వసారి రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు.

సన్మానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం పలువురిని సన్మానించారు. గతంలో పాఠశాలలో విద్యావలంటీర్లుగా పని చేసిన నవీన్, మారుతి, సుజాత, అఖిల ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడంతో వారిని సన్మానించారు. ఇటీవల డాక్టరేట్ పొందిన బి.శ్రీనిజతోపాటు గురుకుల ఉపాధ్యాయురాలుగా ఎంపికైన వెన్నం అనూషను సన్మానించారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, ఉపాధ్యాయులు శేఖర్, శ్రీనివాస్, అంజయ్య, ఇమ్రాన్ ఉన్నారు.

సోన్: మండలంలోని పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేసే ఎ.కృష్ణారావు ఈనెల 30న పదవి విరమణ చేయనున్నారు. గురువారం పాఠశాలలో ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఎంఈవో పరమేశ్వర్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.వెంకన్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, దిలావర్‌పూర్ ఎంఈవో కె.శంకర్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు టి.నరేంద్రబాబు, రవికాంత్, విజయకుమార్, మురళీమనోహర్ రెడ్డి, వహీద్‌ఖాన్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని పంచగుడికి చెందిన కోలోల్ల లింగవ్వకు రూ.60 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. గురవారం బీజేపీ నాయకులు లింగవ్వ ఇంటికి వెళ్లి చెక్కు అందజేశారు. గంగాధర్, జమదండి భూమన్న, పీరు పటేల్, యోగేశ్ పటేల్ ఉన్నారు.